క్లుప్తంగా

శ్రద్ధగా చదవాలి



మీరాభాయి వేషధారణలో ఉన్న హాసినితో విద్యార్థులు

కంచిలి: విద్యార్థి దశ నుంచి భక్తిశ్రద్ధలతో చదవాలని హిందీ ఉపాధ్యాయుడు నిరంజన్ ఖడంగా పేర్కొన్నారు. బూరగాం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల సమక్షంలో మీరాభాయి జయంతిని మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థులు హిందీ పాఠ్యాం నుంచి భక్తిపద్ పాఠానికి సంబంధించి కవయిత్రి జీవిత విషయాలను, కవి పరిచయాన్ని తెలియజేశారు. విద్యార్థిని సింహాద్రి హాసిని మీరాభాయి వేషంలో కీర్తనలు ఆలపించింది. బృందావనంలో మీరాభాయి శ్రీకృష్ణునికి ఆరాధించే ఘట్టాలను తోటి విద్యార్థులకు వివరించింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, కాంతారాలు, రోజారాణి, ధర్మారావు, చలపతి పాల్గొన్నారు.

రీసర్వేతో భూ సమస్యల పరిష్కారం



అవగాహన ర్యాలీలో అధికారులు, నాయకులు

కంచిలి: రీ సర్వే ప్రక్రియ చేపట్టడంతో గ్రామంలో ఉన్న భూసమస్యలకు పూర్తిస్థాయి పరిష్కారం లభిస్తుందని డివిజనల్ సర్వేయర్ చంద్రశేఖర్ అన్నారు. కేసరపడ గ్రామంలో రీసర్వే గ్రామసభను మంగళవారం నిర్వహించారు. ఇందులో రీ సర్వే ప్రక్రియపై స్థానిక రైతులకు అధికారులు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. మండల సర్వే డీటీ శ్రీనివాస్, సర్వేయర్లు, మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి క్రిష్ణారావు, స్థానిక నేతలు మెండ ప్రకాశరావు, కప్పల యుగంధర్, మెండ మురళీనాయుడు, గొరిబిడ్డి మన్మథరావు పాల్గొన్నారు.

వన్యప్రాణులతో పర్యావరణ పరిరక్షణ



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ సిబ్బంది

టెక్కలి: వన్యప్రాణుల రక్షణతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని టెక్కలి అటవీ శాఖాధికారి జి.జగదీశ్వరరావు తెలిపారు. తేలినీలాపురం పక్షుల కేంద్రంలో వైల్డ్ లైఫ్ వారోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వన్య ప్రాణుల రక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వన్యప్రాణులను వేటాడడం చట్టరీత్యా నేరమని వివరించారు. అటవీ అధికారులు ఎస్.కృష్ణారావు, పి.ఝాన్సీ, జె.జయలక్ష్మి, టి.గీతాంజలి పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన



మున్సిపల్ బాలికోన్నత పాఠశాలలో వ్యాస రచన పోటీలో విద్యార్థులు

ఇచ్ఛాపురం: జీఎస్టీపై ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలను మంగళవారం చేపట్టారు. ఇందులో భాగంగా విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాసరచన పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతుల అందజేశారు. అలాగే విద్యార్థులతో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. పోటీలను ఎంఈవోలు కె.అప్పారావు, ఎస్ విశ్వనాధంలు పర్యవేక్షించారు.

సదరం పరీక్షలకు పడిగాపులు!



సదరం పరీక్షలు చేయించుకోవడానికి వేచి ఉన్న దివ్యాంగులు

టెక్కలి రూరల్: సదరం పరీక్షల కోసం స్థానిక జిల్లా ఆస్పత్రికి మంగళవారం వచ్చిన దివ్యాంగులు అవస్థలు ఎదుర్కొన్నారు. నూతన పింఛన్ల కోసం చాలామంది దరఖాస్తులు చేసుకున్నారు. వీరికి చెందిన దరఖాస్తులు మూడు వారాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. వీటిని ఈ రోజు పరిశీలించి సదరం సర్టిఫికెట్ల కోసం పరీక్షలు చేయాల్సి ఉంది. అందరూ ఒకేసారి రావడంతో పడిగాపులుకాయాల్సి వచ్చింది. గంటల తరబడి వేచిఉండాల్సిన పరిస్థితి ఏర్పడంతో ఇబ్బంది పడ్డారు. చాలామందికి కూర్చోవడానికి కుర్చీలు లేకపోవడంతో మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఆధార్ సేవలు అందనంత దూరం!

- మండల కేంద్రం కవిటిలో ఆధార్ సేవలందక అవస్థలు
- పక్క మండలాలకు పరుగులు తీస్తున్న ప్రజలు



ఆధార్ సేవలకు దూరమైన కవిటి సచివాలయం

కవిటి: ఆధార్.. ప్రస్తుతం అన్నింటికీ ఇది ఎంతో అవసరం. ఆధార్ కార్డులేకపోతే ఏపని కూడా జరగని పరిస్థితి. అయితే ఆధార్ సేవలకు కవిటి మండల ప్రజలు దూరమయ్యారు. గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందక తీవ్ర అవస్థలు పడుతున్నారు. కనీసం మండల కేంద్రంలో సైతం ఆధార్ సేవలు అందకపోవడం గమనార్హం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సుమారు ఏడాదిన్నర కాలంలో కవిటి మండలంలో ఆధార్ సేవలపై నీలినీడలు కమ్ముకున్నాయి. మండల వ్యాప్తంగా 22 గ్రామ సచివాలయాలున్నాయి. వీటిపరిధిలో 75 వేలకు పైగా ప్రజలు నివసిస్తున్నారు. ఏ ప్రభుత్వ పథకానికైనా అత్యంతకీలకంగా భావించే ఆధార్‌కార్డుల జారీ ప్రక్రియ మండల పరిధిలో అందుబాటులోకి రాకపోవడంతో ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి ప్రాంతాలకు అధిక వ్యయ ప్రయాసలతో వెళుతున్నారు. ప్రస్తుతం విద్యాశాఖ విద్యార్థులకు అపార్ కార్డులు అందించే ప్రక్రియలో కీలకంగా ఆధార్ కార్డులు అవసరమవుతున్నాయి. ఈ సందర్భంలో ఆధార్‌కార్డులో తప్పుల సవరణ, కొత్త ఆధార్‌కార్డులు చేయించాల్సిన శిశు ఆధార్‌లు పొందడం కవిటి మండలంలో ఇబ్బందిగా మారింది. వాస్తవానికి మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలో మానస పుత్రికగా పురుడు పోసుకున్న గ్రామసచివాలయ వ్యవస్థలో ఆధార్ జారీప్రక్రియ అద్భుతంగా సాగాయి. కవిటి మండలం వరకు చూస్తే బిగొనపపుట్టుగ, ఆర్.బెలగాం, సహలాలపుట్టుగ, రాజపురం, కవిటిలో సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ల పర్యవేక్షణలో ఆధార్ సేవలు సజావుగా అందాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సాధారణ బదిలీల్లో సచివాలయ ఉద్యోగులు వేరే ప్రాంతానికి వెళ్లిపోవడంతో ఆధార్ సేవలు అందని పరిస్థితి నెలకుంది. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కొజ్జీరియా సచివాలయంలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయగా.. ఉన్న కేంద్రాలను మార్చివేశారు. అలాగే కొత్తగా కుసుంపురం, కపాసుకుద్ది, శిలగాంలలో ఆధార్‌కార్డుల జారీకి కొత్తకేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అధికారులు పంపించారు. కానీ ఆప్రక్రియ ఇప్పటికీ ఓ కొలిక్కిరాలేదు. దీంతో ఆధార్ సేవలు నిలిచిపోయాయి. వీటిని తక్షణమే అందించాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం



ప్రస్తుతం రాజపురం, కొజ్జీరియాలో ఆధార్ సేవలు అందుతున్నాయి. కొత్తకేంద్రాలైన శిలగాం, కపాసు కుద్ది, కుసుంపురంలలో ఏర్పాటు చేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. ఉత్తర్వుల కోసం ఎదురు చూస్తున్నాం.

– ఎల్ త్రినాథ, ఎంపీడీవో, కవిటి

అపార్‌కార్డు కోసం ఇచ్ఛాపురం వెళ్లాం

నేను కవిటిలోని ఓ ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియెట్ చదువుతున్నాను. అపార్‌కార్డు కోసం ఆధార్ కార్డులో తప్పుల సవరణ అవసరమైంది. దీంతో కవిటిలో అవకాశం లేకపోవడంతో ఇచ్ఛాపురం వెళ్లాను. అధికారులు తక్షణమే స్పందించి నాలాంటి ఎందరో విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం మండల కేంద్రం కవిటిలో ఆధార్ కేంద్రం సేవలు పునరుద్ధరించాలి.

– పి.శ్రీవిద్య, విద్యార్థిని, కవిటి

రాజేష్ కిశోర్‌పై సుమోటోగా కేసు నమోదు చేయాలి

ఇచ్ఛాపురం రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయిపై దాడి చేసిన మతోన్మాది, కులతత్వవాది రాకేష్ కిశోర్‌పై రాజద్రోహం నేరం కింద సుమోటోగా కేసు నమోదు చేయాలని దళిత సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఏపీ దళిత మహాసభ జిల్లా అధ్యక్షుడు బోకర నారాయణ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు సల్ల దేవరాజులు మంగళవారం వేర్వేరుగా పత్రికా ప్రకటనలు విడుదల చేశారు. సనాతన ధర్మం పేరుతో కుల వ్యవస్థను పెంచి పోషించేందుకు మనువాద, మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని, ఈ దుర్మార్గమైన ఆలోచనతోనే దేశ వ్యాప్తంగా ప్రగతిశీల వ్యక్తులపై, మేధావులపై దాడులు జరుగుతున్నాయని విమర్శించారు. దేశ వ్యాప్తంగా ఉన్న మేధావులు, రచయితలు, కళాకారులు, విద్యావంతులు, దళిత ఆదివాసీలపైన ప్రస్తుతం విపరీతమైన దాడులు జరుగుతున్నాయని, ఈ దాడులు సనాతన ధర్మం తాలూకా దాడులా అన్నది ప్రధానమంత్రి నరేంద్రమోదీ, బీజేపీ, ఆర్ఎస్ఎస్ సంస్థలు దేశ ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సనాతన ధర్మం పేరుతో దాడి చేసిన న్యాయవాది రాకేష్ కిశోర్‌పై చట్టపరంగా చర్యలు తీసుకొని ప్రజాస్వామ్యాన్నియ భారత రాజ్యాంగాన్ని కాపాడాలని కోరారు.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం



అట్ల రాహుల్

టెక్కలి: మెడికల్ కళాశాలలను ప్రైవేట్ పరం చేయాలనే కుటిల బుద్ధితో కూటమి ప్రభుత్వం అమలు చేయనున్న పీపీపీ విధానానికి వ్యతిరేకంగా పోరాటం చేసేందుకు వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల తొమ్మిదో తేదీన అనకాపల్లి జిల్లాలో చేపట్టనున్న పర్యటనను విజయవంతం చేయాలని పార్టీ క్రిస్టియన్ మైనారిటీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు ఆట్ల రాహుల్ కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద, సామాన్య వర్గాలకు చెందిన వారికి ఖరీదైన వైద్యంతో పాటు డాక్టర్ కావాలనే ఆలోచన కలిగిన పేద, సామాన్యవర్గాల విద్యార్థులను వైద్యులను చేయడానికి జగన్ మోహన్‌రెడ్డి చేసిన కృషి ఫలితమే ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కళాశాలల ఏర్పాటు జరిగిందన్నారు. అటువంటి కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడానికి కూటమి ప్రభుత్వం కుతంత్రం చేస్తోందన్నారు. పేద, సామాన్య వర్గాలకు చెందిన విద్యార్థుల పక్షాన పోరాటం చేయడానికి జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న పోరాటానికి ప్రతీ ఒక్కరూ అండగా నిలవాలని కోరారు.

మాజీ మంత్రి పరామర్శ



కామయ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు, నాయకులు

పలాస: పెద్దగురుదాసుపురం గ్రామానికి చెందిన సొర్ర కామయ్య కిడ్నీ వ్యాధితో ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పలాస నియోజకవర్గం సమన్వయకర్త డాక్టర్ సీదిరి అప్పలరాజు మంగళవారం అతని కుటుంబ సభ్యులను, మందస మండలం బహాడపల్లికి చెందిన కొర్నాన సిమ్మయ్య చనిపోవడంతో అతని కుటుంబాన్ని పరామర్శించారు. పలాస మాజీ ఎంపీపీ బత్తిన హేమేశ్వరరావు, చింతాడ మాధవరావు, పార్టీ పట్టణ కమిటీ అధ్యక్షుడు శిస్టు గోపి, మడియా వాసు, సైని దేశయ్య, పోతనపల్లి మాధవరావు, కోరాడ ధనరాజు, జినగ సీతారాం ఉన్నారు.

సందడిగా నందెన్న ఉత్సవాలు



నందిగాంలో నందెన్నను ఊరేగిస్తున్న భక్తులు

నందిగాం: మండలంలోని పలు గ్రామాల్లో నందెన్న ఉత్సవాలు సోమవారం రాత్రి నుంచి ఘనంగా ప్రారంభమయ్యాయి. నందిగాం, పెంటూరు, కణితూరు, దేవుపురం, బెజ్జిపల్లి, పెద్దతామరాపల్లి తదితర గ్రామాల్లో నందెన్న విగ్రహాలను డప్పు వాయిద్యాలతో, మేళతాళాలతో ఊరేగిస్తూ మండపాలలో ప్రతిష్ఠించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

ఇచ్ఛాపురం రూరల్: గౌరీ పౌర్ణమి సందర్భంగా సోమ, మంగళవారాల్లో మహిళలు భక్తి శ్రద్ధలతో గౌరీ, నందెన్న ఉత్సవాలు, వ్రతాలు నిర్వహించారు. నందెన్న విగ్రహాలను, మహాలక్ష్మమ్మ కుడ్ల (వరి దుబ్బు)లను మేళతాళాలు నడుమ పురవీధుల్లో ఊరేగించి ప్రత్యేక పల్లకిలో ప్రతిష్ఠించారు.

భక్తిశ్రద్ధలతో గజలక్ష్మి పూజలు



గజలక్ష్మికి పూజలు చేస్తున్న భక్తులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధి రత్తకన్న గ్రామం నాయుడువీధిలో గజలక్ష్మి పూజలను మంగళవారం భక్తి శ్రద్ధలతో చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు స్థానికులను అలరించాయి.

ట్రాన్స్‌ఫార్మర్‌కు పొదలు తొలగించారు



పొదలు తొలగించిన తరువాత ట్రాన్స్‌ఫార్మర్

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధి సోగ్గాడిపేట వీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు పేరుకుపోయిన పొదలను సిబ్బంది తొలగించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనిపించకుండా పొదలు పేరుకుపోవడంపై 'పొదల్లో ట్రాన్స్‌ఫార్మర్' అనే శీర్షికతో ఈ నెల ఆరో తేదీన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీంతో సిబ్బంది స్పందించి పొదలను తొలగించడంతో సమస్య పరిష్కారమైంది.

కాశీబుగ్గలో 31వ తేదీ వరకు యాక్టు 30 అమలు

పలాస: కాశీబుగ్గ పోలీసు సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల ఒకటి నుంచి 31వ తేదీ వరకు 30 యాక్టు అమల్లో ఉందని ఇన్‌చార్జి డీఎస్పీ డి.లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పోలీసుల అనుమతి లేకుండా ఎవరు ఎటువంటి బహిరంగ సభలు, ర్యాలీలు, సమావేశాలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్కరు గమనించి పోలీసులకు సహకరించాలని కోరారు.

పొంచిఉన్న ప్రమాదం!

- మురుగులో మంచినీటి పథకం ట్యాంకు
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు



మురుగు నీటి మధ్యలో ఉన్న మినీ రక్షిత మంచినీటి పథకం

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలోని కొత్తమ్మతల్లి వీధిలో గల మినీ రక్షిత మంచినీటి పథకం నిర్వాహణ అస్తవ్యస్తంగా ఉంది. పంచాయతీ యంత్రాంగం పూర్తిగా నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ట్యాంకు నీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో మంచినీటి పైపులు లేకపోవడంతో మినీ రక్షిత మంచినీటి పథకంపై స్థానికులు ఆధారపడుతున్నారు. అయితే పథకానికి ముందు భాగం ఖాళీగా ఉన్న పునాదుల్లో మురుగు నీరు చేరిపోయి తద్వారా మంచినీటి పథకానికి చేరుతున్నాయి. మరో వైపు పథకం చుట్టూ మురుగు నీరు చేరిపోయి పందులకు ఆవాసంగా మారింది. దీంతో మంచినీటి కోసం వెళ్లాలంటే స్థానికులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వాస్తవానికి పంచాయతీ యంత్రాంగం ప్రత్యేక పర్యవేక్షణ చేయాల్సి ఉన్నప్పటికీ పథకం వద్ద పరిసరాలు పరిశీలిస్తే అటువంటి పర్యవేక్షణ కానరావడం లేదనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఇప్పటికైనా పంచాయతీ యంత్రాంగం స్పందించి కొత్తమ్మతల్లి వీధి వాసులకు మంచినీటికి ఆధారంగా ఉన్న మినీ రక్షిత మంచినీటి పథకం నిర్వాహణపై ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. లేదంటే మురుగునీటిలో ఉన్న రక్షిత పథకం నీటిని వినియోగిస్తే వ్యాధులు ప్రబలే అవకాశం లేకపోలేదని స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.



రక్షిత మంచినీటి పథకానికి ముందు పందులు, దోమలకు నిలయాలుగా ఉన్న ఖాళీ పునాదులు

మురుగు నీరంతా చేరుతోంది..



మా వీధి వాసులకు ఎంతో ఉపయోగపడుతున్న మంచి నీటి పథకం చుట్టూ మురుగు నీరు చేరిపోయింది. దీని వలన నీటి కోసం వెళ్లడానికి అనేక ఇబ్బందులు పడుతున్నాం. మంచినీటి పథకం పరిసరాలను పరిశుభ్రం చేసి నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని కోరుతున్నాం.

–కె.పద్మజ, కొత్తమ్మతల్లి వీధి, టెక్కలి

మాజీ సీఎం జగన్‌ను కలిసిన తిలక్



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. తాడేపల్లి కేంద్ర కార్యాలయంలో అధినేతను కలిసి నియోజకవర్గంలో మంత్రి అచ్చెన్నాయుడు చేయిస్తున్న అక్రమ అరెస్టులు, కక్షసాధింపు చర్యలతో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సామాన్యులు పడుతున్న ఇబ్బందులను జగన్‌కు వివరించినట్లు తిలక్ తెలిపారు.

–టెక్కలి

విద్యార్థులకు కంటి పరీక్షలు



జాతీయ అంధత్వ దృష్టిలోపం నివారణలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో సంతబొమ్మాళి మండలం మర్రిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో 135 మందికి, ప్రాథమిక పాఠశాలలో 20 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు మంగళవారం నిర్వహించారు. డి.జి.పురం పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి ఎం.ఆర్.కె.దాస్ విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి దృష్టిలోపం ఉన్న 18 మందిని గుర్తించి కళ్లద్దాలకు సిఫారసు చేశారు. కంటి ఆరోగ్య–సంరక్షపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు డి.కూర్మనాయకులు, ఎస్.రాజ్‌కుమార్, ఎంఎల్‌హెచ్‌పీ రాజాన సాయిదేవి, ఆరోగ్య కార్యదర్శి బి.కుమారి, ఆశ కార్యకర్త ఎస్.భారతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

–సంతబొమ్మాళి

జంగిల్ క్లియరెన్స్ చేపట్టండి



వజ్రపుకొత్తూరు మండలంలో బెండి–మంచినీళ్లపేట ఆర్అండ్‌బీ రోడ్డులో బెండి నుంచి పల్లివూరు జంక్షన్ వరకు జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. ఇరువైపులా ముళ్ల చెట్లు, పిచ్చి మొక్కలు వ్యాపించి రోడ్డుపైకి విస్తరించాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ముళ్ల చెట్లు రోడ్డుపైకి వాలిపోయాయి. దీంతో ఈ మార్గంలో తిరిగే ఆర్‌టీసీ బస్సులను అధికారులు నిలుపుదల చేశారు. ప్రైవేట్ స్కూల్ బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి జంగిల్ క్లియరెన్స్ చేపట్టాలని కోరుతున్నారు.

–వజ్రపుకొత్తూరు రూరల్

ముందస్తు ప్రణాళికతో 'ఉపాధి'



ముందస్తు ప్రణాళికతో ఉపాధి పనులు చేపట్టాలని ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప అన్నారు. మంగళవారం టి.బరంపురం పంచాయతీలో జరిగిన గ్రామ సభలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 2025–26 ఆర్థిక సంఘానికి సంబంధించి వేతనదారులకు పూర్తిస్థాయిలో న్యాయం చేసేలా పనులను ఎంపిక చేస్తామన్నారు. అవసరమైన వారికి, అర్హులకు జాబ్‌కార్డులు అందించేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. సర్పంచ్ కారంగి త్రినాథ్‌రెడ్డి, ఏపీవో పి.శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణ పాల్గొన్నారు.

–ఇచ్ఛాపురం రూరల్

రాష్ట్రస్థాయి పోటీలకు ఆదర్శ పాఠశాల విద్యార్థినులు



నందిగాం: రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో ఉపాధ్యాయులు

నందిగాం: జిల్లా కేంద్రమైన శ్రీకాకుళంలో ఈ నెల ఆరో తేదీన జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పెద్దతామరాపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–19 విభాగంలో 400 మీటర్లు, 4 వేల మీటర్ల పరుగుపందెంలో పాఠశాలకు చెందిన ఇప్పిలి వర్ష ఉత్తమ ప్రతిభ కనబర్చి పశ్చిమగోదావరి జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. అలాగే 17 సంవత్సరాల విభాగంలో 800 మీటర్ల పరుగుపందెంలో వనమాలి డిల్లేశ్వరి తృతీయ స్థానంలో నిలిచింది. వీరి ఎంపిక పట్ల ప్రధానోపాధ్యాయులు బమ్మిడి నాగమునేష్, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన పీడీ గజరాపు శ్రీనివాసరావు, పీఈటీ నడిమింటి వైకుంఠరావులను గ్రామస్తులు అభినందించారు.

సోంపేట: సోంపేటలోని ఆదర్శ పాఠశాలకు చెందిన విద్యార్థులు అథ్లెటిక్స్ విభాగంలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ చిన్నాజీ వర్మ తెలిపారు. జిల్లాస్థాయిలో అండర్–17 బాలురు విభాగంలో పదో తరగతి విద్యార్థి గౌరకల నీరజ్ ఐదు కిలోమీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. అలాగే అండర్–14 బాలుర విభాగంలో ఎనిమిదో తరగతి విద్యార్థి సుబ్బుద్ది హరిచరణ్ చెస్‌పోటీల్లో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. వ్యాయామ ఉపాధ్యాయుడు జైమారావు, పోటీలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు అభినందించారు.

టెక్కలి రూరల్: జిల్లా కేంద్రంలో జరిగిన అథ్లెటిక్స్ 400, 600 మీటర్ల పరుగు పోటీలలో స్థానిక అరుణ విద్యాలయానికి చెందిన ఎనిమిదో తరగతి విద్యార్థి బెండి జుహిదీప్ ప్రతిభకరబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ టి.ఆనందరావు, మల్లేశ్వరరావులు తెలిపారు. అలాగే తైక్వాండో పోటీలలో ఏడో తరగతి విద్యార్థి అట్టాడ మహిధర్‌నాయుడు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

పలాస: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని చినబాడాం పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జిల్లా స్థాయి గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో అండర్–14 విభాగంలో అథ్లెటిక్స్‌లో కూర్మపు ప్రణీత్, అండర్–17 విభాగంలో త్రోబాల్‌కు ఎస్.ఆదిత్య ప్రతిభకనబర్చడం ద్వారా రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. వీరిని మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యాయులు అభినందించారు. పీఈటీ టి.గీత, హెచ్ఎం చింతాడ ఉషారాణి, గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ ఉన్నారు.



పలాస: క్రీడాకారులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు